ఇరుకు వంతెనలతో ఇక్కట్లు

- శిథిలావస్థకు చేరిన పొన్నారి లోలెవల్ బ్రిడ్జి
- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

తాంసి: మండలంలోని పలు గ్రామాల వంతెనలు ఇరుకుగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని, ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు రోడ్డుకు అనుగుణంగా లేక ఇరుకుగా మారాయి. మండలంలోని పొన్నారి సమీపంలోని వంతెనతోపాటు హస్నాపూర్ సమీపంలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన వంతెన కూడా ఇరుకుగా మారింది. పొన్నారి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఈ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీనికి ఇరువైపులా ఉన్న రాళ్లు సైతం కూలిపోతున్నాయి. వంతెన వద్ద ప్రమాదకర మూలమలుపు ఉంది. ఆ ప్రాంతంలో రోడ్డు చిన్నదిగా ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

రద్దీగా అంతర్రాష్ట్ర రోడ్డు

నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డు రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి తాంసి, తలమడుగు మండలాలకు చెందిన ప్రజలు సైతం ఈ రోడ్డుగుండానే రాకపోకలు సాగిస్తారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం రద్దీగా ఉంటోంది. పొన్నారి, హస్నాపూర్ గ్రామాల సమీపంలో వంతెనలు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా పెద్ద వాహనం వస్తే ఇతర వాహనాలు ఆగాల్సిందే.

వరుస ప్రమాదాలు

ఇరుకుగా ఉన్న వంతెనల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పొన్నారి సమీపంలోని వంతెన వద్ద గత మే నెల 15న ఎదురుగా వస్తున్న లారీని గుర్తించక ఆటో వేగంగా వెళ్లడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


పొన్నారి వద్ద ఇరుకుగా లోలెవల్ బ్రిడ్జి

ప్రభుత్వం చొరవ చూపాలి



పొన్నారి గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలి. హస్నాపూర్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలి. పెద్దపెద్ద వాహనాలు వచ్చినప్పుడు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి త్వరగా నిర్మాణం చేపట్టాలి.

– నవకాంత్‌రెడ్డి, వాహనదారుడు, తాంసి

ఇరుకుగా వంతెన



పొన్నారి లోలెవల్ వంతెనపై వర్షాకాలంలో వరదనీరు ప్రవహిస్తుంది. వరద ప్రవాహానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రాళ్లు ఊడిపోయాయి. అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న వంతెన ఇరుకుగా ఉంది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– శంకర్ పొన్నారి గ్రామ యువకుడు

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన


అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థులను కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో పోటీకి వచ్చిన 70కి పైగా ఇన్నోవేషన్స్ ప్రదర్శనల్లో విద్యార్థులు రూపొందించిన విత్తనం నాటే యంత్రం ప్రాజెక్ట్ ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. విద్యార్థులతోపాటు గైడ్ ఉపాధ్యాయుడు ఎల్.రాము, ప్రిన్సిపాల్ సుధారాణి, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, డీఈవో ప్రణీతను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

ఐటీడీఏ పీవోను కలిసిన గిరిజనులు

సిరికొండ: ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ని ఆమె కార్యాలయంలో మండలంలోని కోసుగూడ గ్రామస్తులు, గిరిజనులు మంగళవారం కలిశారు. గతంలో చేపట్టిన పోడు భూముల సర్వేను మళ్లీ చేయాలని, కొత్తగా ఏర్పడిన కోసుగూడ గ్రామానికి పాఠశాల ఏర్పాటుతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఆమెను శాలువా కప్పి సన్మానించారు. కురం రావుజీ పటేల్, జంగుబాపు, కురం యాదవ్‌రావు, వాగు, గంగారాం, జాదవ్ రోహిదాస్, కోసేరావు, లక్ష్మణ్, కురం కోసేరావ్ పాల్గొన్నారు.

ట్రెజరీశాఖ డీడీని కలిసిన టీఎన్జీవో నాయకులు


డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా ట్రెజరీ శాఖ డీడీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.హారికను ఆమె కార్యాలయంలో టీఎన్జీవో సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, తిరుమల్ రెడ్డి, గోపి, రాజేశ్వర్, చంద్రమోహన్, ప్రవీణ్, గంగాధర్, నారాయణ, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు మహేందర్, సుజాత, స్రవంతి, అన్నపూర్ణ, సబ్ ట్రెజరీ అధికారి రమణచారి పాల్గొన్నారు.

సాగు నీరందించడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: రైతులకు సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క ఎకరాకు అదనంగా సాగునీరు అందించలేదని విమర్శించారు. జిల్లాలో పెన్‌గంగ బ్యారేజీ నిర్మాణం పూర్తి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే జోగురామన్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాత్నాల ప్రాజెక్ట్ కెనాల్ మరమ్మతు నిర్వహణ కోసం రూ.4 కోట్ల నిధుల ప్రతిపాదనలు అందజేసి ఏడాది గడిచినా ఇప్పటికి నిధులు మంజూరు కాలేదన్నారు. రైతుబంధు పేరిట ప్రోత్సాహకాలు అందజేస్తూ రైతులకు అందాల్సిన విత్తనాలు, ఎరువులు వంటి వాటిని నిలిపివేశారని మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్ కొత్తపెల్లి, బీజేపీ అధికార ప్రతినిధి శివయ్య, కాంత, రాము, సబ్బర్ పవన్ పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలని ఏజెన్సీ షెడ్యూల్ కులాల జాయింట్ యాక్షన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, కమిటీ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్ కోరారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీలకు ప్రభుత్వం ఇస్తానన్న మూడెకరాలకు బదులు రూ.30 లక్షలు విలువ గల ప్యాకేజీ ఇవ్వాలని, విద్య ఉద్యోగ, రాజకీయ రంగంలో 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అర్హులకు దళితబంధు అందించాలని కోరారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి



బోథ్: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గం బోథ్ అని పేర్కొన్నారు. వేంకటేశ్వర ఆలయం నుంచి పట్టణం వరకు సెంట్రల్ లైటింగ్ రెండు వరుసల రహదారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. మండల కన్వీనర్ సుభాష్ సూర్య, ఉపాధ్యక్షుడు లాడేవార్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్, పట్టణ అధ్యక్షులు రవి, బోర్ రవీందర్, ఓబీసీ మండల అధ్యక్షులు రమేశ్, ఓబీసీ మోర్చా మండల కోఆర్డినేటర్ సంతోష్, బీజేవైఎం మండలం అధ్యక్షుడు సాయికుమార్, నారాయణ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

బోథ్‌ను రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజనల్ కార్యాలయం, ఫైర్ స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యువతకు నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు, మినీ స్టేడియం స్టేడియం నిర్మించాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. పట్టణ కార్యదర్శి నరేశ్, నియోజకవర్గ కార్యదర్శి బి.గోవర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాస్, భోజన్న, నరేశ్, షకీర్, మున్సీఫ్, ప్రేమ్, సుమేర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడంతోపాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి మున్సిపాలిటీగా చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో స్వల్పకాలిక విస్తరక్ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్‌రావ్ ఆమ్టేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐటీఐ కళాశాల, వంద పడకల ఆస్పత్రి, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి శేఖర్, సాయిప్రసాద్, సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి


ఇంద్రవెల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

నార్నూర్/ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం ధనోర గ్రామంలో ఇటీవల ఆదివాసీ మహిళపై లైంగిదాడి చేసి హత్య చేసిన నిందితులను ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావు డిమాండ్ చేశారు. ఆదివాసీల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నార్నూర్‌లో నిరసన చేపట్టారు. ఇంద్రవెల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన అనంతరం బహుజన సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ ఘటన జరిగి 15 రోజులు గడుస్తున్నా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ స్పందించకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిందితులను శిక్షించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని నాయకులు హెచ్చరించారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కాంరాజ్, ఖానాపూర్ నియోజవర్గ భీం ఆర్మీ అధ్యక్షుడు దత్త, బీఎస్పీ ఖానాపూర్ నియోజవర్గ ఉపాధ్యక్షుడు శివాజీ, నాయకులు రాహుల్, సలాం వరుణ్, మర్సకోలా నాగేష్, పెందోర్ సంతోష్, పెందోర్ గోవింద్, పెందోర్ మధు, కోరేంగ్ శంభు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీరాంపూర్, టెక్డిరాంపూర్ పాఠశాలకు చెందిన 75 మంది విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది వారికి రక్తపరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేశారు. హెచ్‌ఎంలు శ్రీరాములు, వెంకటేశ్వర్, భీంరావు, సూపర్‌వైజర్ గంగాధర్, లూసి, ఏఎన్‌ఎంలు సంధ్యారాణి, లచ్చుబాయి, ఆశకార్యకర్తలు హిమబిందు, గుణాదేవి ఉన్నారు.

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ కోసం మంగళవారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఇఫ్రాత్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో గత రెండు రోజులుగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రక్తపరీక్షలు చేశామన్నారు. ఝరి ఆశ్రమ పాఠశాలలో 50 విద్యార్థులను పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ సంజయ్ ఆడే, హెచ్ఏ ప్రకాశ్, ఏఎన్‌ఏం మెస్రం శ్రీదేవి, కల్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఊరట

బోథ్/తాంసి: బోథ్, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. రైతులు విత్తనాలు విత్తి వారం రోజులకు ఎండిపోయే పరిస్థితుల్లో ఉండగా వాన కురవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


గొర్రెల యూనిట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కిషన్

తలమడుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే గొర్రెల, మేకల యూనిట్ల రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ కోరారు. మండలంలోని కోత్తుర్ గ్రామానికి చెందిన బూర్గుల రాకేశ్‌కు ఎన్ఎల్ఎం పథకంలో మంజూరైన రూ.40 లక్షల రుణాల గొర్రెల యూనిట్ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ పథకంలో కేంద్రం రూ.20 లక్షల రాయితీ అందిస్తోందన్నారు. అనంతరం సుంకిడిలో పశువైద్యశాల తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పశువైద్యాధికారి దుద్‌రామ్ రాథోడ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ


మొక్కు చెల్లిస్తున్న మహిళలు

ఆదిలాబాద్: ఖత్రి సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆ సమాజ్ భవనం నుంచి శోభాయాత్రగా మహాలక్ష్మి ఆలయానికి బోనాలతో మహిళలు చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని మొక్కుకున్నట్లు సమాజ్ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్ తెలిపారు. ఏళ్లుగా ఇదే ఆనవాయితీ కొనసాగుతుందన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ఖత్రి సమాజ్ ప్రధాన కార్యదర్శి రాజ్‌శ్రీనివాస్, సతీశ్, పవన్ పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు


చేతికి పెట్టుకున్న గోరింటాకు చూపిస్తున్న మహిళలు

ఆదిలాబాద్: ఆషాఢమాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల శ్రీరామాలయంలో మంగళవారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేతులకు గోరింటాకు పూసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. వందన, భారతి, సారిక, ప్రీతి, కవిత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్


జైనథ్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



న్యూఢిల్లీలో జన్మదిన వేడుకల్లో అభిమానులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకలను జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ కేక్ కట్ చేశారు. ఎంపీపీ జైవంత్‌రావు, జీవవైవిధ్య మేనేజ్‌మెంట్ జిల్లా కమిటీ సభ్యుడు మర్సుకోల తిరుపతి, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సలీమొద్దీన్, సీతారాం, కాటం రమేశ్, సాజిద్, అబుజర్, రాజు, సలాం దేవురావు పాల్గొన్నారు.

జైనథ్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మెల్యే జోగు రామన్న జన్మదిన వేడుకల్లో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి, రక్తదానం చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి బొకేలు, పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, నాయకులు సర్సన్ లింగారెడ్డి, మద్దుల ఊశన్న, పెందూర్ దేవన్న, తల్లెల చంద్రయ్య, తదితరులు ఉన్నారు.

కైలాస్‌నగర్: న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న అభిమానులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కేక్ కట్ చేశారు.

బోథ్: జోగు రామన్నకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, రాజేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, అఖిల్, ఉదయ్, అభిలాష్, సాయన్న, రోహిదాస్, మహేందర్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల నుంచి ఆదిలాబాద్‌లోని ఓ గార్డెన్ వరకు కార్యకర్తలు, నాయకులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. మావలలో టపాసులు కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. రాజేశ్వర్, అజీమ్, సుధీర్, సంతోష్, జగదీశ్‌గౌడ్, గంగన్న, ఇమ్రాన్, సృజన్, నారాయణ ఉన్నారు.

నేరడిగొండ: ఎమ్మెల్యే జోగు రామన్నకు జెడ్పీటీసీ అనిల్ జాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతం రెడ్డి, ఇచ్చోడ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముండే పాండురంగ్, మాజీ ప్యాక్స్ చైర్మన్ నానక్ సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, రమేశ్ నర్వడే, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

బేల: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెల కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఆదివాసీ భవనంలో మండల గ్రామ పంచాయతీ కార్మికులతో మంగళవారం సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నంబర్ 51 తీసుకువచ్చి, కార్మికుల పని భద్రతను దూరం చేసిందన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చి పనిభారం పెంచిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా సంఘం కార్యదర్శి బొజ్జ ఆశన్న, నాయకులు వాగురావు, రమేశ్, సంతోష్, లచ్చన్న, అశోక్, దేవ్‌రావు తదితరుపాల్గొన్నారు.

గుడిహత్నూర్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట పడుతామని మండల పంచాయతీ కార్మికులు తెలిపారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి రాందాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు వెంకటి, ఆశన్న, రాజు, రమేశ్, మాధవ్, లక్ష్మీబాయి, అనసూయ, పార్వతి, గౌరుబాయి, శ్రీను, నారాయణ, విజయ్, మోసిన్ ఉన్నారు.

మండల సమావేశం వాయిదా

గుడిహత్నూర్: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో సునీత ప్రకటించారు. కోరం సభ్యులు రాకపోవడంతోపాటు ఎంపీపీ సైతం అందుబాటులో లేని కారణంగా సమావేశం వాయిదా వేశామని పేర్కొన్నారు. సమావేశం తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

జైనథ్: రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. మండలంలోని కరంజిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్, కాంగ్రెస్ ఇతర హామీలను గురించి ప్రజలకు వివరించారు. నాయకులు అశోక్, ఎల్టి జగదీశ్ రెడ్డి, గంగన్న, రాము, సామ రూపేష్ రెడ్డి, ప్రభాకర్, నగేశ్ పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

బోథ్: సొనాల మండలంగా ప్రకటించిన నేపథ్యంలో గ్రామంలో బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆలయ పనులు పూర్తిచేయాలి

బోథ్: మండలంలోని మర్లపల్లిలో నిలిచిన ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్‌ను గ్రామస్తులు మంగళవారం కలిసి విన్నవించారు. వెంటనే దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ దేవేందర్ వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉట్నూర్ ఎస్టీవో కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన మెమోరండాన్ని ఎస్టీవో కార్యాలయంలో అందజేశారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు శశికాంత్, కార్యదర్శి జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాధర్, అశోక్, జనార్దన్, దేవిదాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

బోథ్: సోనాల గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మండలంలో బుధవారం పర్యటిస్తారని ఎంపీపీ రాథోడ్ సజన్, ఆ పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కుంటాల(కె), కుంటాల(బి) గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం 11 గంటలకు మండల కేంద్రంలో పోడు భూముల పట్టాల పంపిణీలో పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారిపేటలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నియోజక వర్గ నాయకుడు పెందూర్ ప్రభాకర్ వారికి కండువా కప్పారు. నాయకులు ఆత్రం రఘునాథ్, శేషు, ఆనంద్‌రావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ మేళా విజయవంతం చేయండి

నార్నూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో నిర్వహించే ఆధార్ మేళాను విజయవంతం చేయాలని ఐపీవో సంజీత్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్ చేయనివారు, చిన్నపిల్లల ఆధార్ తీయనివారు, పుట్టిన తేదీ సవరించుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన ఆధార్‌కార్డు తీసుకునేవారు తమ పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణపత్రం మీసేవ నుంచి తీసుకురావాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న పాత ఎస్సీ కాలనీవాసులు

ఇచ్చోడ: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మండల కేంద్రంలోని పాత ఎస్సీకాలనీ వాసులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు సిరిసిల్ల భూమయ్య, దుబాక సుభాష్, కొత్తూరి లక్ష్మణ్ మాట్లాడారు. దళితుల ఇళ్ల స్థలాల కోసం పదేళ్ల క్రితం భీమన్న గుట్ట వద్ద భూమిని కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మోహన్‌సింగ్‌కు అందజేశారు.